క్లుప్తంగా

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కొత్తూరు: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పాలకులు, యువత అంతరాలు లేని సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. విగ్రహం ఏర్పాటుతో సరిపెట్టకుండా ఆయన కలలను సాకారం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్‌లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను గురువారం ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు సంబంధించిన మస్టర్లను పరిశీలించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రతిరోజు కొలతల ప్రకారం పనులు చేపట్టాలని కోరారు.

కీర్తికి సన్మానం



కీర్తిని సన్మానించిన సత్యనారాయణరెడ్డి, నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కీర్తి కూచిపూడి నృత్యంలో మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కీర్తి భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ సల్లా ఉద్దీన్, నాయకులు రామ్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలే మేలు

కొందుర్గు: డిజిటల్ లావాదేవీలను ప్రతిఒక్కరూ అలవాటు చేసుకోవాలని ఏపీఎం జయమాలిని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, సామాజిక భద్రత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. అలాగే, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగదు రహిత లావాదేవీలు జరపాలని సూచించారు.

బోరు మోటారు పనులు ప్రారంభం

షాద్‌నగర్: పట్టణంలోని 11వ వార్డులో నూతనంగా వేస్తున్న బోరు మోటార్ పనులను గురువారం కౌన్సిలర్ శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చొరవతో షాదీఖానా వద్ద బోరు వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో జమ్రుద్‌ఖాన్, పిల్లి శేఖర్, జాఫర్, అప్సర్, మసూద్ అలీ, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్లపల్లిని విమర్శిస్తే సహించం

కాంగ్రెస్ నేత శ్రీనునాయక్

షాద్‌నగర్‌రూరల్: స్వలాభం కోసం కొందరు నేతలు పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌ను విమర్శిస్తున్నారని ఆ పార్టీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. గురువారం చౌదరిగూడ పార్టీ మండల అధ్యక్షుడు రాజు, నర్సింహులుతో కలసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి 22 ఏళ్లు సేవలందించామని గొప్పలు చెప్పుకుంటున్న ఆశన్నగౌడ్‌కు రాజకీయాల్లో సముచితమైన స్థానం కల్పించింది శంకర్ అని గుర్తు చేశారు. వీర్లపల్లి శంకర్‌ను విమర్శిస్తే ఆశన్నగౌడ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు దర్శన్, శివరాములుగౌడ్, మాధవులు, నవీన్, అశోక్, ఆంజనేయులు, సందీప్, కుమార్ నాయక్, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

బీఎస్పీ డివిజన్ ఉపాధ్యక్షుడు శ్రీశైలం

షాబాద్: గొప్ప దేశభక్తుడు, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బీఎస్పీ చేవెళ్ల డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కర్రె శ్రీశైలం స్వేరో అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అంబేడ్కర్ చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఏ ఒక్కవర్గానికి చెందినవాడు కాదని, అందరివాడని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ వ్యవస్థను ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మార్చిన ఘనత అంబేడ్కర్‌దే అని కొనియాడారు. కార్యక్రమంలో మున్నూరు కాపు శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాజేష్, చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు కోజ్జంకి జైపాల్ తదితరులున్నారు.

తెల్ల కుసుమ సాగుపై ఆసక్తి

- మార్కెట్లో కుసుమ నూనెకు మంచి డిమాండ్
- ఆరోగ్యానికి ఎంతో మేలు



తిర్మలాపూర్‌లో సాగు చేసిన తెల్లకుసుమ పంట

షాబాద్: తెల్ల కుసుమ పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో కుసుమ నూనెకు మంచి డిమాండ్ ఉంది. షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో తెల్ల కుసుమలను గానుగ పట్టే యంత్రాలు ఉన్నాయి. చుట్టు పక్కల మండలాల ప్రజలు ఇక్కడికి వచ్చి కుసుమలను గానుగ పట్టించి నూనెను తీస్తారు. ముద్దెంగూడ, ఏర్రోనిగూడ, తిర్మలాపూర్, బొబ్బిలిగామ, గోల్లూరుగూడ గ్రామాల్లో 180 మంది రైతులకు అధిక దిగుబడినిచ్చే ఐఎస్‌ఎఫ్ 746 రకం కుసుమ విత్తనాలు సాగు చేసినట్లు తెలిపారు. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన అనంతరెడ్డి 8 ఎకరాల్లో సాగు చేశారు.

సాగుకు ప్రోత్సాహం కరువు

రబీలో పండించే నూనెగింజలలో ప్రధానమైనది తెల్లకుసుమ పంట. తెల్ల కుసుమను తెల్లజొన్న, శనగ పంటలో అంతర పంటగా వేసేవారు. అయితే, మండలంలో పత్తిసాగు పెరగడం తెల్ల కుసుమకు శాపంగా మారింది. పత్తి పంటను ఖరీఫ్‌లో సాగు చేసినప్పటికీ రబీ పంట కాలం ముగిసే వరకు దిగుబడినిస్తుంది. దీంతో రబీసాగుకు అవరోధం ఏర్పడుతోంది. వేల ఎకరాల్లో సాగు చేసే తెల్ల కుసుమ పంట వందల్లోకి పడిపోయింది. ప్రస్తుతం మండలంలో సుమారు 2059 నుంచి 2500ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

రికార్డుస్థాయిలో ధరలు

తెల్లకుసుమ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించడంలేదు. సర్దార్‌నగర్, చేవెళ్ల మార్కెట్లో తెల్ల కుసుమ విత్తనాలు దొరకడం లేదు. రైతులు భద్రపరుచుకొన్న విత్తనాలను మాత్రమే విత్తుకోవాల్సి వస్తోంది. సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో తెల్ల కుసుమ రేట్లు రికార్డు స్థాయిలో గణనీయంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో తెల్ల కుసుమలు క్వింటాలుకు రూ.6వేలు పలుకుతోంది. తెల్ల కుసుమలను కొని మరాడించి తీసిన నూనె కిలో రూ.450 పలుకుతోంది. గానుగాడించిన నూనె మార్కెట్లో లభించడం లేదు. మిల్లులో, లేదా రైతుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆరోగ్యానికి ఎంతో మేలైన తెల్ల కుసుమ సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

రఘునాథ్‌కు ఉత్తమ రైతు పురస్కారం



మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రఘునాథ్ రాజేంద్రనగర్‌లోని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ వెజిటేబుల్ ఆయిల్స్–2023 సదస్సులో రఘునాథ్ ఉత్తమ రైతు పురస్కారం అందుకున్నారు.

– రఘునాథ్, ఉత్తమ రైతు, తిర్మలాపూర్, షాబాద్

తెల్లకుసుమ నూనె వాడుతాం



మా పెద్దల కాలం నుంచి తెల్లకుసుమ నూనె వాడుతున్నాం. పొలంలో పండించిన తెల్లకుసుమలను గానుగ ఆడించి నిల్వ చేసి ఏడాది పొడవునా వినియోగిస్తాం. మా బంధువులకు కూడా పంపిస్తాం. ఈ సంవత్సరం 8 ఎకరాలల్లో తెల్ల కుసుమ పంట సాగు చేశాను.

–అనంతరెడ్డి, రైతు తిర్మలాపూర్

గతంలో ఏడాది పొడవునా గానుగ



ఐదు, ఆరు దశాబ్దాలకుపైగా మా వద్ద గానుగ ఉంది. గతంలో ఏడాది పొడవునా తెల్లకుసుమలను గానుగాడించే వాళ్లం. ప్రస్తుతం మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలపాటు మాత్రమే గానుగకు పని ఉంటుంది. మిగతా రోజుల్లో ఉపాధి కోసం వేరే వృత్తులు చేపట్టాల్సి వస్తుంది. గత రెండు సంవత్సరాలుగా తెల్లకుసుమ పంట సాగు పెరిగింది.

– మల్లేష్, గానుగ నూనెమిల్లు యాజమని, తాళ్లపల్లి

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

పోస్టర్ల ఆవిష్కరణ

చేవెళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ వెంకటేశ్వర్లు, సర్పంచ్ బి.శైలజ అన్నారు. చేవెళ్లలో గురువారం అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఎంపీటీసీ వసంతం, ఫైర్ స్టేషన్ అధికారి భిక్షపతిలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం అందించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అగ్నిమాపక కేంద్రం అధికారి భిక్షపతి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, బస్‌స్టేషన్‌లు, ఇలా ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, ప్రజాప్రతినిధులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి

మొయినాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సరైన సమయంలో రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని, రక్తదానం చేయడంతో వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అనంతరం ఎంఎస్‌జే బ్లడ్ బ్యాంక్ అండ్ క్యాన్సర్ ఆస్పత్రికి 150 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్, ఓబీసీ సెల్ కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు మల్లేష్, శ్రీకాంత్, శివ, నాయకులు లక్ష్మీపతియాదవ్, రాజమల్లేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మీరెడ్డి

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ధ్యానప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి

షాబాద్: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని నరెడ్లగూడ, మల్లారెడ్డిగూడ తదితర గ్రామాల్లో ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్వాస మీద ధ్యాస అనే ధ్యానం తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు ఉండే రుగ్మతలను నయం చేస్తుందన్నారు. ప్రస్తుతం శరీరంలో ఉన్న వ్యాధులను తొలగించుకోవడానికి, భవిష్యత్తులో వ్యాధులు రాకుండా ఉండడానికి ధ్యానం ఉపకరిస్తుందని తెలిపారు. నిత్యజీవితంలో ధ్యానం చేయడం దినచర్యగా మార్చుకోవాలన్నారు. ప్రమాదకరమైన క్యాన్సర్, గుండె జబ్బులు, బీపీ, షుగర్ వంటి వ్యాధులు ధ్యానంతో తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, వెంకటలక్ష్మి, వెంకటేశ్వర్లు, అంజయ్య, కృష్ణమద్దిలేటి, స్వప్న, రాధ, సుభద్ర, రాంచంద్రయ్య, విజయ్‌కుమార్ తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి, శ్రీనివాస్

పౌష్టికాహారంతో క్షయవ్యాధి నివారణ

డాక్టర్ ఝాన్సీ



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న డాక్టర్ ఝాన్సీ

షాద్‌నగర్: పౌష్టికాహారంతో క్షయవ్యాధిని నివారించవచ్చని డాక్టర్ ఝాన్సీ అన్నారు. గురువారం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో క్షయ రోగులకు ఆమె పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ.. ట్యూబర్‌క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా గాలి ద్వారా క్షయ వ్యాధి వ్యాపిస్తుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారికి విపరీతమైన దగ్గు, జ్వరం వస్తుందన్నారు. ఛాతి, తలనొప్పి, నీరసం, అలసట, ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ఈ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, శివరాజ్, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ షఫీ, టీబీ ఫార్మసీ హెల్త్ సూపర్ వైజర్ రవి, ల్యాబ్ టెక్నీషియన్ సలాంఖాన్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొత్త పీఆర్సీని ప్రకటించాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు డిమాండ్

షాద్‌నగర్: ప్రభుత్వం ఉద్యోగులకు కొత్త పీఆర్సీని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు డిమాండ్ చేశారు. సంఘం 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎంఆర్‌సీ భవనం ఆవరణలో సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ... ప్రభుత్వం చేపడుతున్న విధానాలతో ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. బదిలీలు, పదోన్నతులు కల్పించడం లేదని, డీఏలు కూడా సరిగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల జీతాలు 15వ తేదీ దాటిన తర్వాత వస్తున్నాయని తెలిపారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వం పీఆర్సీ కమిటీని వేసి పెరుగుతున్న ధరలకు జీవన వ్యయాలకు అనుగుణంగా జీతాలను పెంచే సంప్రదాయం తెలంగాణలో కొనసాగుతోందన్నారు. 2023 పీఆర్సీ వర్తింపజేయాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ విషయమై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కమిటీని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సంఘం జెండాను ఆవిష్కరించిన నర్సింలు

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

సర్పంచ్ బసిరెడ్డి పద్మ



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

షాద్‌నగర్: కంసాన్‌పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సర్పంచ్ బసిరెడ్డి పద్మ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హరితహారంలో భాగంగా నర్సరీ, శ్మశాన వాటిక, క్రీడామైదానం, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో నర్సింలు, యాదయ్య, బాలవర్ధన్‌రెడ్డి, రవి, వెంకటయ్య, కుమార్, లవ్ యాదయ్య, కృష్ణయ్య, సయ్యద్, మున్ను, శివ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇఫ్తార్ విందు

షాద్‌నగర్‌టౌన్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ గోపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6గంటలకు పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. ముస్లింలందరు విందుకు హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

ప్రహరీ తొలగించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలో సాయిబాలాజీ టౌన్‌షిప్ వారు గేటెడ్ కమ్యూనిటీ పేరుతో నిర్మించిన ప్రహరీగోడను తొలగించాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ప్రహరీ నిర్మాణం వల్ల వెంచర్ వెనక భాగంలో ఉన్న కాలనీలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంచర్ యజమానులు సరిహద్దు వెంబడి నిర్మించిన ప్రహరీ గోడను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు

షాద్‌నగర్‌రూరల్: మండలంలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన బిల్లులు, చెక్కులపై ఉపసర్పంచ్ బీమ్లా నాయక్ సంతకాలు చేయడం లేదని, దీంతో అభివృద్ధి పనులకు, గ్రామ పంచాయతీ నిర్వహణకు ఇబ్బందులు తలెత్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఫిబ్రవరి 17న కలెక్టర్ హరీశ్ అతని చెక్ పవర్‌ను రద్దు చేశారు. కాగా, పంచాయతీలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించినందుకే సర్పంచ్ తనపై కక్ష కట్టి చెక్ పవర్ రద్దు చేయించారని బీమ్లానాయక్ ఆరోపించారు. బిల్లులపై సంతకాలు చేయాలని అడిగితే కమీషన్ల కోసం తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని సర్పంచ్ ఆరోపించారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

ఏపీడీ జంగారెడ్డి ఆకాంక్ష

కొందుర్గు: ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే సర్కార్ లక్ష్యమని, ఇందుకు ప్రభుత్వం లక్‌పతి పథకం అందుబాటులోకి తెచ్చిందని ఏపీడీ జంగారెడ్డి అన్నారు. మహిళల జీవన స్థితిగతుల వివరాలను రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయం, పాడిపరిశ్రమ, చిరువ్యాపారాలు తదితర వివరాలతో కూడిన పూర్తి డాటాను నమోదు చేయాలని సూచించారు. ఈ డాటా ఆధారంగానే భవిష్యత్‌లో పథకాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయమాలిని, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి బాధ్యత ప్రజాప్రతినిధులదే

మంత్రి హరీశ్‌రావు

మొయినాబాద్ రూరల్: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు జీవంతు తదితరులు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని, గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి.. ప్రభుత్వం అభివృద్ధి పనులను చేయడంలో ముందుంటుందని సమస్యలు తెలపడమే ఆలస్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హరీశ్‌రావును సన్మానిస్తున్న జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్

అభివృద్ధిలో కార్యదర్శులదే కీలక పాత్ర

శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి



కార్యదర్శులను సన్మానిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: పంచాయతీ కార్యదర్శులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ పూర్తి చేసుకున్న నేపథ్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు చేర్చే బాధ్యత వారిదేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, ఎంపీఓ గీత పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో ఇల్లు నిర్మించి ఇస్తా

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కొందుర్గు: హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ మండలంలోని మహదేవ్‌పూర్‌లో పర్యటించారు. గ్రామానికి చెందిన సునీత తనకు సొంతిల్లు లేదని, డబుల్ బెడ్‌రూంకు దరఖాస్తు చేసుకున్నా రాలేదని వాపోయింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేస్తామని మోసం చేసిందని విమర్శించారు. మహదేవ్‌పూర్‌లో చాలా మంది పేదలు ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సొంత ఖర్చుతో సునీతకు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, పరుశురామ్, రవి, శ్రీను, గోపాల్‌నాయక్, వివేక్ రెడ్డి, మహేందర్, సంతోష్, ప్రశాంత్ పాల్గొన్నారు.



సునీతతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

‘కంటి వెలుగు’తో దృష్టి సమస్యలు దూరం

సర్పంచ్ మల్లారెడ్డి



కంటివెలుగును ప్రారంభించిన మల్లారెడ్డి

చేవెళ్ల: కంటి వెలుగుతో పేదలకు దృష్టి సమస్యలు దూరమవుతాయని పామెన సర్పంచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పామెన గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి గ్రామానికి వెళ్లి కంటి పరీక్షలు చేయించడంతో అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణచారి, ఉప సర్పంచ్ సరళ, కార్యదర్శి బి.ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ నూతన కమిటీ ఎన్నిక

షాద్‌నగర్ రూరల్: మండల పరిధిలోని రాసుమల్లగూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నర్సింలు, సహాయ కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా మహేందర్, సభ్యులుగా రాఘవేందర్, రఘుపతిరెడ్డి, దర్శన్, నాగేష్, వెంకటేష్, ప్రవీణ్, పాండు, బల్వంత్, రవి, రాజు, వెంకట్‌రెడ్డి, మాధవిరెడ్డిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు శంకర్ నియామక పత్రాన్ని అందజేశారు.



నియామక పత్రం అందజేస్తున్న శంకర్